నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
11 హైదరాబాద్, సోమవారం 18 మార్చి 2024 HYDERABAD

## డ్రగ్స్ నిర్మూలిద్దాం..!



'డ్రగ్స్ నిర్మూలిద్దాం..భవిష్యత్‌తరాలను కాపాడుకుందాం' అంటూ సలాం జీవన్ డ్రగ్స్ ఫ్రీ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం గోల్కొండలో పర్యాటకులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల బారిన పడితే జీవితాలు నాశనమవుతాయని అన్నారు డాక్టర్ మహ్మద్ ఇమ్రాన్ అలీ, అనుజ్ కుమార్ దాస్ . పిల్లలపై దృష్టిసారించి వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించాలన్నారు.

–సిటీబ్యూరో



వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు జలవిహార్‌లో సందర్శకుల జలకాలాట



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, వివేకానంద్, కృష్ణారావు, లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్, దయానంద్, మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

## కలిసి కట్టుగా..
# గెలుపే లక్ష్యంగా..

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశం ■ 'మల్కాజిగిరి'పై గులాబీ జెండా ఎగిరేలా కార్యాచరణ

మేడ్చల్, మార్చి17(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం గెలుపే లక్ష్యంగా ఆదివారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమయ్యారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు మల్లారెడ్డి వివేకానంద్, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌కుమార్, దయానంద్ సమావేశంలో పాల్గొన్నారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన అభివృద్ధిని చూసి నగర ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉండటంతో భారీ మెజార్టీతో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించేందుకు ప్రజల మద్దతును కూడకట్టే విధంగా ప్రచారం చేయాలని సమావేశంలో తీర్మానించుకున్నారు. కాగా, అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రత్యేకంగా అభినందించారు.

### మల్కాజిగిరి బీఆర్ఎస్‌దే: అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని గెలిచేది బీఆర్ఎస్సేనని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జరిగిన సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలు భారీ మెజార్టీతో గెలువడమే ఇందుకు నిదర్శనమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే తరహాలో గ్రేటర్ ప్రజలందరూ బీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తారన్న పూర్తి నమ్మకం తనకు ఉందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ఐటీ రంగంలో హైదరాబాద్‌కు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారని చెప్పారు. ఐటీ రంగంతో పాటు అన్ని రంగాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందాయన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తనకు మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కనిపిస్తే కరిచేస్తున్నాయ్



## వీరంగం సృష్టిస్తున్న వీధి కుక్కలు

- గుంపుగుంపులుగా స్వైరవిహారం
- పిల్లల నుంచి వృద్ధుల వరకు బాధితులే...
- పిక్కలు లాగేస్తున్నా.. ప్రాణాలు పోతున్నా..పట్టని బల్దియా
- రోజురోజుకూ సమస్య తీవ్రరూపం
- వీధి కుక్కల నియంత్రణలో చేతులెత్తేసిన అధికారులు
- మేయర్ ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మొన్న అంబర్‌పేట...నిన్న షేక్‌పేట, రాజేంద్రనగర్, నేడు ఆద్రాస్‌పల్లి.. ఇలా వరుసగా వీధి కుక్కల దాడి సంఘటనలతో నగరవాసులు హడలిపోతున్నారు. పిల్లలు మొదలుకొని మహిళలు, వృద్ధుల వరకు ఇలా వీధి కుక్కలు ఎవరినీ వదలడం లేదు. మనిషి కనిపిస్తే చాలు కరిచి పడేస్తున్నాయి. పగబట్టినట్లే ప్రవరిస్తూ కండలు పీకేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ఎవరో ఒకరు.. కుక్క కాటుకు బలవుతున్న పరిస్థితి. నారాయణగూడలోని ఐపీఎంకు కుక్క కాట్లతో సుమారు 200 మంది బాధితులు క్యూ కడుతున్నారంటే.. బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా..జీహెచ్‌ఎంసీ వీధి కుక్కల నియంత్రణను గాలికి వదిలేసింది. తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నది. ప్రధానంగా వీధి కుక్కలకు ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్) ఆపరేషనే కాకుండా రేబిస్ నివారణ టీకాలను వేయడంలో బల్దియా నిర్లక్ష్యం వహిస్తోంది. ఏబీసీ ఆపరేషన్లు పెంచేందుకు మూడు జోన్లలో జంతు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు విషయంలోనూ అలసత్వం ప్రదర్శిస్తున్నది.

### 70 శాతం శునకాలకు ఏబీసీ..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 70 శాతం కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన కుక్కలకు శస్త్రచికిత్స జరగాల్సి ఉందన్నారు. ఈ లెక్కలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన హైలెవల్ కమిటీ సమావేశంలోనూ వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సంబంధిత అధికారులు చెప్పలేకపోయారు. దీంతో మేయర్‌తో పాటు అన్ని పార్టీల కార్పొరేటర్లతో ఏర్పాటైన హైలెవల్ కమిటీ సభ్యులు తీవ్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. అయినా సంబంధిత వెటర్నరీ విభాగంలో చలనం లేదు. దీంతో రోజురోజుకూ వీధి కుక్కల బెడద తీవ్రరూపం దాల్చుతున్నది. ఒంటరిగా కనిపిస్తే చాలు.. గుంపులుగా వెంటపడి కరుస్తున్నాయి. వీధుల వెంబడి గుంపులు గుంపులుగా తిరుగుతూ దడ పుట్టిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందిస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక వైపు ఎండవేడితో పాటు చెత్త వ్యర్థాల డంపింగ్ వద్ద నిల్వ ఉన్న ఆహారపదార్థాలను తినడం వల్ల కుక్కల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. కనిపించిన వారిపై పిచ్చికోపంతో దాడులకు తెగబడుతున్నాయి. సహజంగా ఎండాకాలంలో తాగునీటి వసతి తక్కువగా ఉండటంతో వేడి తీవ్రతతో కుక్కల్లో ప్రకోపనం (ఇరిటేషన్) అధికంగా ఉంటుంది. కాగా, వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, రేబిస్ వ్యాక్సిన్లు వేశామని చెబుతున్నా..పెరుగుతున్న కుక్క దాడులు అధికారుల అలసత్వానికి అద్దం పడుతున్నాయి.

| | మొత్తం వీధికుక్కలు | స్టెరిలైజేషన్ | స్టెరిలైజేషన్ చేయని కుక్కల సంఖ్య |
|---|---|---|---|
| ఎల్బీ నగర్ | 67242 | 42857 | 24385 |
| చార్మినార్ | 109771 | 72105 | 37666 |
| ఖైరతాబాద్ | 43810 | 35632 | 8178 |
| శేరిలింగంపల్లి | 33181 | 31368 | 1813 |
| కూకట్‌పల్లి | 48114 | 41213 | 6901 |
| సికింద్రాబాద్ | 77038 | 58952 | 18086 |



### 18 నెలల పాపపై వీధి కుక్కల దాడి

శామీర్‌పేట, మార్చి 17 : వీధి కుక్కల దాడిలో 18 నెలల పాప తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కరుణాకర్ కూతురు రుష్మిత ఆడుకుంటుండగా వీధి కుక్కలు చుట్టు ముట్టి దాడి చేశాయి. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు కుక్కలను చెదరగొట్టి పాపను తొలుత నీలోఫర్ ఆస్పత్రికి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



## చీరకట్టు.. రన్ అదిరెట్టు





టైటాన్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ తనైరా ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఆదివారం నిర్వహించిన శారీ రన్ ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. అంతకు ముందు ఈ రన్‌ను ముఖ్య అతిథులుగా హాజరైన హెరిటేజ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి, యశోద హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ శారద, నటీ సంధ్యా జనక్‌తో కలిసి ప్రారంభించారు. మహిళలు ఇంటి బాధ్యతలే కాకుండా తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, యోగా, మెడిటేషన్‌తో పాటు సమతుల్యంగా పోషకాహారాలు తీసుకోవాలని వారు సూచించారు. మహిళలు ధరించే చీరలకు 5వేల సంవత్సరాల చరిత్ర ఉందని నారా బ్రాహ్మణి అన్నారు.

–ఖైరతాబాద్, మార్చి 17

## ఇదేందయ్య దానం..?

అవకాశవాద రాజకీయాలపై నియోజకవర్గ ప్రజల ఆగ్రహం

ఖైరతాబాద్, మార్చి 17 : కారు గుర్తుపై గెలిచి..హస్తం గూటికి చేరిన ఎమ్మెల్యే దానంపై ఆయన అనుచరులు ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఖైరతాబాద్ నియోజకవర్గ సమస్యలను గాలికొదిలేసి.. అవకాశవాదంతో హస్తం గూటికి చేరారంటూ ప్రజలు సైతం మండిపడుతున్నారు. పార్టీ ఫిరాయిస్తున్నట్లు కనీసం తమకు చెప్పనేలేదని, మూడో కంటికి తెలియకుండా కాంగ్రెస్‌లో చేరికపై కొందరు అనుచరులు, బీఆర్ఎస్ శ్రేణులు ఫైర్ అవుతున్నట్లు తెలిసింది. 2014 తర్వాత రాజకీయ నిరుద్యోగిగా మారిన సదరు ఎమ్మెల్యేకు.. రెండు సార్లు అవకాశం ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ. ఆ పార్టీలో చేరడంతో ఆదరించిన నియోజకవర్గ ప్రజలు 2018లో పట్టం కట్టారు. గతేడాది 2023లో కూడా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపిస్తే తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో విస్మయానికి గురికావడం ఓట్లు వేసిన ప్రజల వంతైంది. ఇప్పటికే నియోజకవర్గంలో డ్రైనేజీ, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. తాజా పరిణామంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- హైదరాబాద్‌లో 361 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 76,575 మంది విద్యార్థులు
- 5 నిమిషాల గ్రేస్ పీరియడ్..

సిటీబ్యూరో, మార్చి 17 ( నమస్తే తెలంగాణ ) : పది పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్ జిల్లాలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 361 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. 76,575 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. 15 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమై 12:30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఉదయం 8:30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని అధికారులు సూచించారు. 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ అందుబాటులో ఉంటుందన్నారు. హాల్ టికెట్లను www.bse.telangana.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కలెక్టర్ అనుదీప్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.



సికింద్రాబాద్‌లోని ఓ పాఠశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది